# మారిపోయిన మనిషి

ఆ కూత మళ్ళీ కూశావంటే పళ్ళురాల్తాయ్! ఆఁ ఏమనుకుంటున్నావో? మరీ వళ్లు తెలియక చస్తున్నావ్!"

"వళ్లు తెలియక చస్తుందెవరో తెలుస్తూనే వుంది."

"మూయ్ నోరు! మాటకు మాట ఎదురుచెప్తావా?" శేషయ్య చేతిలో వున్న వంకెకర్ర పెళ్ళాం మీదకు నిలువుగా లేచి నుంచుంది.

"ఊఁ కొట్టండి! కూడు పెట్టటంచేత కాకపోయినా కొట్టటంమాత్రం తెలిసిందిలే! ఊఁ! కొట్టండి చూస్తారేం?" రెండు చేతులూ అడ్డంపెట్టి ముందుకు ముందుకు జరుగుతూ అన్నది రామసుబ్బమ్మ.

"ఏమిటి నాన్నా! అదీ!" అంటూ శేషయ్య కూతురు వంటింట్లోనుండి పరుగెత్తు కొచ్చింది.

"ఛీ! ఛీ! మనిషిజన్మ ఎత్తేక కాస్త పరువూ, మర్యాదా వుండాలి!" అంటూ శేషయ్య ఎత్తిన కర్రను దూరంగా విసిరేసి, వసారాలోకి పోయి మంచం వాల్చుకుని మేను వాల్చాడు.

పాతిక సంవత్సరాలు కాపరం చేసిన రామసుబ్బమ్మ భర్తకు తొలిసారిగా ఎదురు తిరిగింది. పతి

వ్రితా, పరమసాధ్వి అయిన రామసుబ్బమ్మ—భర్త గీచిన గీటును దాటి ఎరుగని రామసుబ్బమ్మ, ఈ లోక దై వాన్నే ధిక్కరించింది! సత్యకాలం కాకపోబట్టి సరి పోయింది. కాకపోతే అటు సూర్యుడు యిటు పొడిచి, నక్షత్రాలు ఝుల్లున నేల రాలి, భర్త శాపాగ్నిలో రామ సుబ్బమ్మ మలమలా మాడి మసై వుండేది! కాకపోతే చిన్నసైజు నల్లరాతిబండైనా అయివుండేది.

అదేమీ కాకపోగా రామసుబ్బమ్మ మీద మీదకు "ఏమాత్రం కొడతావో కొట్టూ?" అన్నట్లు వచ్చింది. దానికి తగ్గట్టు కమల ఒకతి! అమ్మకుతగ్గ కూతురే!

అస్త్రసన్యాసం చేసి వచ్చి పడుకున్న శేషయ్య మెదడు కుతకుత లాడిపోయింది. జరిగిన సంఘటనను గురించిన ఆలోచనల్లో మునిగిపోయాడు.

ఛ! తను పొరపాటు చేశాడు! ఆ వజాన రెండు తగిల్తే పోయేది! దానికి తాను రానూ మంచీ - చెడూ తెలియకుండా పోతోంది! దీనితోనేనా, తను యిన్నాళ్లు కాపరం చేసింది? ఇంత బతుకూ బతికి యింటెనకాల చావమన్నట్టు యివ్వాళ యిది యిడ్డెన్న వ్యాపారం చేస్తుందా? తన యింటా వంటా లేని యింత నీచపు పనిని తను చూస్తూ చూస్తూ ఎలా అంగీకరిస్తాడు? తమ కులమూ-వంశమూ-పరువూ-మర్యాదా ఛీ! ఛీ! ఎంత కాకపోతేమట్టుకు తను యివ్వాళ యింత పరువుతక్కువ పనికి వొప్పుకుంటాడా? బుద్ధి తక్కువ దానికి, ఆమాత్రం

జ్ఞానం వుండక్కర్లా? ఇద్దెన్ను వొండుకొని యింటి యింటికీ తిరిగి అమ్ముకోవటమా? కస్తూరివారి కోడలు యిడ్డెన్న పళ్ళెం యెత్తుకుని యిల్లిల్లూ తిరగటమా?

గతాన్ని తవ్వుకొని శేషయ్య వంశ చరిత్ర అతని కళ్ళముందు తిరిగింది.

శేషయ్యగారి తాత కస్తూరి అమరయ్యగారి పేరు వినని వాళ్లు ఆ చుట్టుపక్కల నాలుగు ఆమడల్లో లేరు. అమరయ్యగారేనాడో అంతరించినా ఆయనగారి కీర్తికి చిహ్నాలుగా, వూళ్ళో ఒక దేవాలయమూ, ఒక సత్రమూ, ఒక నుయ్యీ, మర్రిచెట్టూ ఈనాటికీ వున్నాయి. శేషయ్య తండ్రి సుక్షేత్రంలాంటి పదిహేనెకరాల మాగాణీ కర్పూరంలా వెలిగించి తండ్రిని మించిన కొడుకనిపించుకున్నాడు. పోతే శేషయ్య తండ్రి, తాతలు ఆర్జించిన అనంతమైన కీర్తికీ, గౌరవానికీ వారసుడై వుడతా భక్తినీ, మిగిలిపోయిన పదెకరాలను, కుటుంబ గౌరవం, కీర్తి ప్రతిష్ఠలకింద మార్చి, పితృదేవతలకు కళంకం రాకుండా కాపాడి తన వారసత్వాన్ని నిలుపుకొన్నాడు. ఆ వంశ వృక్షంలోనివారు మనకు తెలిసినంతవరకు వొరులకు పెట్టేవారే గాని 'దేహి' అని ఒకడిని అర్థించలేదు.

శేషయ్య జీవితంలో ఓ అర్ధశతాబ్దం, చీకూ చింతా లేకుండా గడిచిపోయింది, కాని గత రెండు మూడు సంవత్సరాలుగా, ఆర్థికమైన యీతిబాధలు శేషయ్య ఆత్మను కాకపోయినా దేహాన్ని పట్టి పీడించసాగాయి.

ఉన్న స్థిరాస్తి, చరాస్తి, అంతా అప్పులవాళ్ళ పాలుకాగా ఓ యిల్లు మాత్రం మిగిలి వుంది. శేషయ్య స్వయంగా వ్యవసాయం చేసేవాడు కాదు. పోనీ యేదైనా వ్యాపారం చేసేవాడా అంటే, అదీ కాదు. అది వాళ్ళ వంశంలో లేని సంగతి. 'గొప్పగా' 'గౌరవంగా' బత కటం వారి వంశంలో వారికి ఉగ్గుపాలతో వచ్చిన మాట!

సత్రములు కట్టించి సమారాధనలు చేయించిన శేషయ్యగారింట్లో ఈ రోజు పొయ్యిలో పిల్లి లేవటమే అంతంతమాత్రం అయిపోయింది. ఇంతకాలం భర్తకు ఒదిగి మదిగి వున్న రామసుబ్బమ్మ కళ్ళు తెరిచింది. ఇప్పు డైనా మేలుకొని యేదో జీవనాధారం సాగించుకుంటే గాని, భుక్తికి గడిచే మార్గం అన్యథా లేదని తలపోసిన శేషయ్య పెళ్లాం ఇడ్లన్న వ్యాపారం చేసి పొట్టపోసుకోవా లనే నిర్ణయానికి వచ్చింది. దొంగతనం-ఇంకా-ఇంకా-చేస్తే తప్పుకాని కష్టపడి పనిచేసుకొని నాలుగురాళ్ళు సంపాదించుకుంటే తప్పేముందని ఆమె అభిప్రాయం. మెరకవీధిన వున్న వెంకాయమ్మ ఇడ్లన్న వ్యాపారం చేసి ఇద్దరి కూతుళ్ళ పెళ్ళి చేసి చిన్న యిల్లు వేసుకోలా?

ఓ రోజున రామసుబ్బమ్మ తన గోడును పొరు గింటి కాంతమ్మగారితో వెళ్ళబోసుకుంది. ఆమె సాధార ణంగా వెంకాయమ్మను చూపించి "ఏమిటమ్మా నీదంతా పిచ్చిగాని! రోజూ పొద్దున్నే నాలుగు వాయిలు ఇడ్లెన్ను వేసి అమ్ముకుంటే ఒక రూపాయి డబ్బులు కళ్ళచూస్తావు-

ఇంటి ఖర్చు ఎల్లమారిపోదూ ? ఆ మెరకవీధి వెంకా యమ్మను చూడరాదూ ? ఇద్దరి కూతుళ్ళ పెళ్లిళ్లు చేసి, ఇంత నిలవకూడ చేసుకొన్నది !" అన్నది.

ఇంట్లోవున్న వెండి కంచాలూ, కూర గిన్నెలూ, మార్వాడీ కొట్లోకి తరలిపోగా రామసుబ్బమ్మ ఏదో ఒకటి చెయ్యకపోతే లాభంలేదని ఆదుర్దాపడసాగింది.

"ఏమో ! ఇద్దెన్ల వ్యాపారం పెడితే ఆయన ఒప్పు కుంటారో లేదో !" అన్నది రామసుబ్బమ్మ, నేస్తం కాం తమ్మతో.

"ఒప్పుకోక ఉరిపోసుకుంటాడా ఏం ? నీదంతా చోద్యం కాకపోతే !" అన్నది కాంతమ్మ.

"తప్పేముందిలే ! ఏదో ఒకటి చెయ్యక తప్పు తుందా ? సరేకాని, ఈ పూటకు తవ్వెడు బియ్యం బదు లివ్వు ! మొత్తం కలిపి రెండు రోజుల్లో ఇస్తాను" నసి గింది రామసుబ్బమ్మ.

"అయ్యో తల్లీ ! మా ఇంట్లోకూడా నిండు కున్నయే ! ఈ నెల్లో ఐదు మానికలు నీకే యిస్తిని ? అప్పుడే ఏం అయి నయి అని ధాం ధూంలు చేస్తున్నాడే ఆయన తల్లీ !" అన్నది కాంతమ్మ.

రామసుబ్బమ్మ సగం చచ్చి నెత్తిన చీరకొంగు వేసుకొని ఖాళీబుట్ట తీసుకొని ఇంటికి తిరిగొచ్చింది.

రాను రాను రామసుబ్బమ్మకు చేబదుళ్ళూ పుట్ట కుండా పోయినై. శేషయ్య చేతికి ఇంట్లో అమ్మదగిన వస్తువేదీ దొరక్కుండా పోయింది.

అనేక రాత్రిళ్ళు ఆకలితో నిద్రమానేసి ఆలోచించిన ఫలితంగా రామసుబ్బమ్మ ఒక నిర్ణయాని కొచ్చింది. ఒక రోజు మెరకవీధి వెంకాయమ్మ దగ్గరకెళ్ళి ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ, ఇడ్డెన్ల వ్యాపారంలోని సుళువు బళువులన్నీ తెలుసుకు వచ్చింది.

వెంకాయమ్మే నయం! కూతుళ్ళ పెళ్ళిచేసి ఇంత వెనక్కూడా వేసుకొంది. తనకూ పెళ్ళీడుకొచ్చిన కూతురుంది. ఆ మనిషి చూస్తే చీమకూడా కుట్టనట్లు తిరుగుతాడు. తనుమాత్రం ఏం చెయ్యగలదు? సంసారం గడిచే మార్గమేది? "గొప్పగా" బతికిన కుటుంబమని ఈ రోజు పనీ పాటా లేకుండా కూర్చుంటే గడుస్తుందా? తను ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒళ్ళొంచి నాలుగు వాయిలు యిడ్లెన్లు వేసి అమ్ముకుంటే తప్పేముంది?

రామసుబ్బమ్మ మథన పడి పడి ఓరోజు భర్తతో అనగా కస్సుమని లేచాడు.

ఇకపోతే రాగా పోగా ఇల్లు మాత్రం వుంది. ఆయన వాలకం చూస్తే అదికూడా అమ్మకానికో, తాకట్టుకో పెట్టే ధోరణిలో వుంది. ఆ యిల్లు కాస్తా పోతే వుండటానికి నీడ కూడా వుండదు. ఎదిగొచ్చిన పిల్లను రొమ్ములమీద కుంపటిలా పెట్టుకొని తను ఏమైపోతుంది?

శేషయ్య పెళ్ళాం తెగింపు చేసింది. ఏమయితే అయిందని ఇడ్డెన్ల వ్యాపారం చెయ్యాలనే నిశ్చయాని కొచ్చింది.

ఆ రోజు ఉదయం రామసుబ్బమ్మ తన నల్లపూసల గొలుసు—తనకు పెళ్ళయిన రోజుల్లో చేయించుకొన్నది తీసి బజారుకు రహస్యంగా మొగుడికి తెలియకుండా పంపి అమ్ముకొన్నది. మెళ్ళో వట్టి నల్లపూసలూ, పసుపుకొమ్మూ కట్టుకొని, నల్లపూసలూ, మంగళసూత్రం అమ్మగావచ్చిన రెండువందల రూపాయలూ, పెట్టెలో భద్రంగా దాచింది.

ఎలా పసికట్టాడో శేషయ్య సాయంత్రం రచ్చ బండ దగ్గరనుంచి వచ్చి భార్యమీదకు దూకుడుగా లేచాడు.

రామసుబ్బమ్మ మొండికేసి మోటు సరిచింది.

"ఇల్లాంటి దౌర్భాగ్యపు పనులు చేశావంటే ప్రాణాలు తోడేస్తాను" అన్నాడు శేషయ్య.

"అన్నీ చేశావులే! నోరు మూసుకు వోమూల పడివుండు!" అన్నది రామసుబ్బమ్మ.

శేషయ్య ఉగ్రుడై పోయి, పళ్లు బిగించి భార్య మీదకు దూకాడు.

ఉద్రేకంలో వళ్ళు మర్చిపోయిన రామసుబ్బమ్మ మరోమాట మిగిలింది.

"ఆ కూత మళ్ళీ కూశావంటే పళ్లు రాల్తాయ్" అంటూ శేషయ్య కర్ర పైకెత్తాడు.

అదీ సంగతి! ఆ రోజు శేషయ్యకు అంత కోపం రావటానికి కారణం. ఇంత బతుకూ బతికి ఇంటెనకాల

చాపమన్నట్టు భార్యకు, ఇన్నేళ్లు వచ్చినా ఇంగిత జ్ఞానం లేకుండా ఇడ్డెన్ల వ్యాపారానికి సిద్ధమవట మేమిటి ?

"అదేవిటి నాన్నా !" అంటూ కూతురు తల్లి తండ్రి మధ్యకు రావటంతో కర్ర అవతల పారేసి మంచం మీద నడుంవాల్చి పడుకొన్న శేషయ్య హృదయం తుక తుక లాడిపోయింది.

ఛీ ! ఛీ ! ఇక తను దీనితో సంసారం చెయ్యలేడు!

అది వీధినపడి ఇడ్డెన్లు అమ్మటం మొదలు పెట్టాక తను ఏ ముఖంతో ప్రజలముఖం చూస్తాడు ? తరతరాలుగా తన పూర్వీకులు ఆర్జించిన కీర్తి ప్రతిష్టలను ఈ రోజు ఈ ముండ ఇడ్డెన్ల పాత్రలో పెట్టి కాల్చివేస్తుందా ? దీని వాలకంచూస్తే రేపో మాపో ఇడ్డెన్ల అమ్మకం ఆరంభించేట్లుగా వుంది. అది చూస్తూ ప్రాణాలతో తను బతకలేడు. అయినా తన బతుక్కు ఇక అర్థంలేదు. పూలు అమ్మిన చోటే కట్టెలు అమ్మాల్సి వస్తుందిగదా ? "ఏమయ్యా ! శేషయ్యా ! నీ పెళ్ళాం ఇడ్డెన్ల వ్యాపారం సాగించిందటగా ?" అని నిలవేసి వూళ్ళోవాళ్ళు అడిగితే తను ఆ మాటలు విని, సహించగలడా ? తన కుటుంబ గౌరవానికీ, సాంప్రదాయానికీ, రేపటితో బలిదానం ప్రారంభ మవుతుంది. బతికినన్నాళ్లు తను బతకపోడు ! బతికి నన్నాళ్ళు పరువుగా బతికాడు ! పరువు పోయాక ఇక బతుకెందుకూ ?

మహాసముద్రంలో వాయుగుండం ప్రారంభ మయాక, లేచిపడే అలల్లా శేషయ్య బుర్రలో ఆలోచనలు వువ్వెత్తుగా లేచి, సాగి, విరిగిపోతున్నాయి. శేషయ్య ముసుగు బిగించి పడుకున్నాడు.

రాత్రి పదిగంటలు దాటింది. కాని శేషయ్య ముసుగు తన్ని పట్టి పడుకొనే వున్నాడు.

"భోజనానికి లేవమనవే!" రామసుబ్బమ్మ సన్నగా, తలుపు పక్కగా నుంచొని కూతురుతో అన్నట్లు, భర్త నుద్దేశించి అన్నది.

శేషయ్య ఉలకనూ లేదు, పలకనూ లేదు.

"లే! నాన్నా! చాలా పొద్దుపోయింది!" కూతురు కూడా వచ్చి అన్నది.

శేషయ్య ముసుకులోనుంచి ముఖం బయటకు పెట్టి "పోండి! అవతలకు! నాకు అన్నంవద్దూ, ఏమీవద్దు!" అన్నాడు.

"అదేమిటి నాన్నా అట్లా అంటావ్!" అన్నది కూతురు దీనంగా.

"ఈ మంకుపట్టేమిటే ఇన్నేళ్లూ వచ్చీ?" అన్నది రామసుబ్బమ్మ.

"ముందు పదండి అవతలకు? మీ చావు మీరు చావండి! నా చావు నేను చస్తాను! ఇక మీకూ నాకూ సంబంధంలేదు. ఆఁ. ఇహఁ ఇంతే!" అంటూ శేషయ్య మళ్ళీ ముఖంమీదకు గుడ్డ కప్పుకొని పడుకున్నాడు.

అవును! శేషయ్య ఆత్మాభిమాని! ఆత్మాభిమానం ఆయనగారికి ఉగ్గుపాలతో పెట్టింది! శేషయ్య మాటంటే మాటే! హరిహరాదులు అడ్డొచ్చినా తను అనుకొన్న పన్ని సాధించాల్సిందేను. మరి శేషయ్యంటే శేషయ్యా! అమరయ్యగారి మనుమడు! ఉక్కుపిండం! ఉద్దండుడు—ప్రచండుడు — ఇంకా ఏమేమో ప్రశంసలు అందు కున్నాడు లోకంనుంచి.

శేషయ్య స్వభావం తెలిసిన కూతురూ తల్లీ, అక్కడనుంచి జారుకున్నారు.

"ఆ మనిషికి ఒకళ్ళు చెబితే తల కెక్కదూ; తనకు తోచదూ?" నిట్టూరుస్తూ మంచం వాల్చుకుంటూ పడు కొంటూ "పిల్లా! నువ్వు పెట్టుకు తినవే!" అన్నది.

"నువ్వుకూడా తినవే!" అన్నది కూతురు.

"నువ్వు పోవే! నన్ను విసికించక! పోయి తిను!" కసురుతూ అన్నది రామసుబ్బమ్మ.

కమల మారు మాటాడకుండా పిల్లిలా పోయి పడుకుంది.

ఎంత ప్రయత్నించినా రామసుబ్బమ్మకు నిద్ర పట్టలేదు. మంచంమీద అటూ యిటూ పొర్లటం మొదలు పెట్టింది.

ఏం మనిషమ్మా! ముదనష్టపాడు! ఆస్తంతా సర్వనాశనం చేశాడు. తినడానికి కూడు లేకుండా చేశాడు.

రెండు చేతులా, పరువూ, ప్రతిష్టా, దాన ధర్మాలంటూ-సర్వం దుబారా చేశాడు. ఎదిగొచ్చిన పిల్ల — ఇంట్లో వున్నదన్న జ్ఞానంకూడా లేదు. ముసలిపీనుగ ఒప్పుకుంటే నేం ? ఒప్పుకోక పోతేనేం ? తను తప్పకుండా వ్యాపారం చేసి తీరుతుంది. నాలుగు వాయిలు ఇడ్డెన్లు వేసి అమ్ము కుంటే ఈయన పరువు ప్రతిష్టలు కాలిపోతయ్యట ! ఇం టింటికీ చేట పుచ్చుకుని బదుళ్లు అడుక్కుంటుంటే పరువు గాబోలు ! నీ పరువూ నువ్వూ మండ ! రామసుబ్బమ్మ పెళ్లున మెటికలు విరిచింది.

ఈ రెండు వందలతో గుట్టు చక్కగా వ్యాపారం చేసుకో వచ్చు. ఓ పాతిక రూపాయలు పెట్టి ప్రస్తుతానికి ఇడ్డెన్ల పాత్రి, సామాను కొంటే సరిపోతుంది. ఓ బస్తా బియ్యం, ఓ బస్తా మినుములూ కొని ఇంట్లో వుంచుకుంటే లాభసాటిగా వుంటుంది. అంతా ఓ వంద రూపాయలతో సరిపోతుంది. ఎంతలేదన్నా రోజుకు రెండు రూపాయలు చూడొచ్చు ! తను మాత్రం వీధిన తిరుగాలా ఏం ? డబ్బులిచ్చి ఓ కుర్రాడిని పెట్టుకుంటే పొద్దున్నే ఓ గంట అట్లాపోయి అమ్ముకొస్తాడు ! చుట్టు పట్ల వాళ్లు ఎటు దిరిగీ ఇంటికేవచ్చి కొనుక్కుపోతారాయె !

కాస్త బాగా సాగితే మధ్యాన్నం పూట, గారెలూ, చిట్టిగారెలూ వేసి కుర్రాడి కప్పజెపితే వాడే అమ్ముకొస్తాడు. పావలా డబ్బులు చేతిలో పెడితే ఎవడో కుర్రాడు దొరక్కపోడుగా ? అయినా పని చేసుకుంటే తప్పేముంది ? లేక మాడిచస్తారా ఏం ? దేవుడు మేలు

చేసి, కాలం కలిసివచ్చి వ్యాపారం బాగా సాగితే నిదానంగా ఓ చిన్న కాఫీహోటలే పెట్టవచ్చు. అవును మరి! హోటలు వ్యాపారం మీద వేలు గడించిన వాళ్ళున్నారు. పిల్లను ఒక ఇంటిదాన్ని చేస్తే తన దిగులు తీరిపోతుంది—

తను పెట్టబోయే ఇడ్డెన్ల వ్యాపారాన్ని గురించి ఆలోచిస్తూ, రామసుబ్బమ్మ కునుకు తీసింది.

తొలికోడి కూసింది. రామసుబ్బమ్మ వళ్లు విరుచుకుంటూ లేచింది. రాత్రి అన్నం తినకపోవటాన శరీరం నీరసంగా వుంది. తెల తెలవారుతోంది. కాకులు బాదం చెట్టుమీద రొదచేస్తూ గుంపులు గుంపులుగా లేచి అల్లీ బిల్లీ తిరుగుతున్నాయి. బావి దగ్గర ముఖం కడుక్కొని పైటచెంగుతో ముఖం తుడుచుకుంటూ దేవుడి గదిలోకి వచ్చింది రామసుబ్బమ్మ.

"ఆ మనిషి నిద్రలేవకముందే డబ్బు తీసుకు బజారుకుపోయి ఇడ్లీపాత్ర సామానులూ, బియ్యం, మినుములూ వగైరా కొనుక్కువస్తే మంచిది. అన్నట్టు కాంతమ్మ సాయం వస్తానన్నది. దాని మొగుడు రామలింగయ్యను కూడా తీసుకెళ్ళితే మంచిది. ఆ సుళువు బళువు తనకు తెలియబాయె! రెండుసార్లు వాళ్ళసాయం తీసుకుంటే తర్వాత తనంతటతనే చేసుకోగలదు. ఇదేం బ్రహ్మావిద్య గనకనా? ఒంటరిముండ వెంకాయమ్మ చేసుకోవటం లేదూ?

ఆలస్యమైతే ముసలిపీనుగ లేస్తాడేమో? ఇది చూస్తే మళ్ళీ ఈపూట రంగం పెట్టుకుంటాడు!

అనుకుంటూ రామసుబ్బమ్మ నిశ్శబ్దంగా నడిచి గదిలోకివెళ్ళి పెట్టె తెరచింది. గుడ్డల పొత్తుల కిందుగా వేళ్లు పోనిచ్చి తను ఆనవాలుగా పెట్టిన చోటు వెతికింది.

రామసుబ్బమ్మ గుండెలు శార్ మన్నాయి! చేతి వేళ్లు వణికాయి! గుడ్డలన్నీ బయటకు తీసి పెట్టెంతా కెలికింది! గుడ్డల మడతలు ఒక్కొక్కటే విదిలించి చూసింది. పెట్టె తిరుగా బోర్లా వేసి వెతికింది.

"హరి భగవంతుడా! నా డబ్బు!" నిలువు గుడ్లు వేసి నేలమీద చతికిలబడి నెత్తి బాదుకుంది.

ఖాళీపెట్టె బావురుమంటూ ఆమెకేసి చూసింది!

రామసుబ్బమ్మ రొమ్ములు బాదుకుంటూ "అయ్యో దొంగలు పడ్డారర్రో! కొంప గుండం చేశారర్రో!" అని విలపిస్తూ శేషయ్య పడుకున్న గదికేసి పరిగెత్తింది.

"అయ్యో! మీ నిద్ర మండిపోనూ? కొంప దోపిడీ అయిపోయింది! లేవండర్రో!" అంటూ రామసుబ్బమ్మ తలుపు తోసుకొని గదిలోకి వచ్చింది.

శేషయ్య మంచంమీద లేడు! మంచం బోసిగా, దిగులుగా ఆమెకేసి చూస్తున్నట్లే అనిపించింది. ఒక్కక్షణంపాటు రామసుబ్బమ్మ నిశ్చేష్టురాలై నిల్చుంది. నివ్వెరపోయిన రామసుబ్బమ్మ తెప్పరిల్లుకుని గదంతా కలయజూసింది.

దండెంమీద ఉతికిన ధోవతులు లేవు! కొయ్యా పెట్టె పైన గుడ్డల సంచి లేదు! వంకిన శేషయ్య చేతికర్ర లేదు.

రామసుబ్బమ్మ గాలి బిగబట్టి మంచకింద చూసింది. శేషయ్య చెప్పులు లేవు !

"అయ్యో! నా కొంప తీశాడరోయ్!" అంటూ రామసుబ్బమ్మ ముఖాన చేతులేసి బాదుకుంటూ భోరున ఏడ్చింది. కూతురు వచ్చి తల్లిని కావలించుకొని ఏడ్చింది సంగతేమో అర్థం కాకుండానే. కొద్ది క్షణాల్లో ఇరుగు పొరుగు వాళ్ళంతా వచ్చి గదిలో నిండిపోయారు.

"నేను అనుకుంటూనేవున్నా అంతపనీ చేస్తాడని!" అన్నాడు ఓ ముసలాడు. అందరూ తలోకమాటా అన్నారు.

"శేషయ్య పారిపోయాడా? అన్నాడు ఒక ఆసామి రామసుబ్బమ్మ కళ్ళలోకి గుచ్చి చూస్తూ.

.... .... .... ....

రైల్లో ఓ మూల వొదిగి కూర్చొని ఉన్న శేషయ్య ముఖం గంభీరంగా వుంది. రైలు వేగాన్ని, రొదను మించి శేషయ్య బుర్రలో ఆలోచనలు సాగినై —

తను ఈ శరీరాన్ని కొద్ది రోజుల్లోనే త్యజించ బోతున్నాడు. తన అభీష్టమూ నెరవేరింది. ఆ రెండు వందల రూపాయలు, పోవటంతో ఇడ్డెన్ల వ్యాపారం కూడా గల్లంతే. అయినా తను రెండువందల - అంతా తీసుకరాకుండా వుంటే బాగుండేదేమో? తను చావ

తలుచుకుంటే ఇంతకంటే వేరే మార్గాలు లేవూ? ఇంటి దగ్గర ఏ బావిలో పడిచచ్చినా, వురిపోసుకున్నా, ముందు పోలీసులొచ్చి చుట్టుకుంటారు. శవాన్ని తీసుకెళ్ళి ఆసుపత్రిలో కోస్తారట! ఎంత దారుణం? తను అలా ఎన్నటికీ జరుగనివ్వడు!

శేషయ్యకు తనమీదనే కాకుండా తన శవంమీద కూడా వల్లమాలిన అభిమానంలా వుంది!

తన జీవితకాలం అంతా చాలా సత్కార్యాలూ, దానధర్మాలూ, చేసి పుణ్యం ఆర్జించాడు. అలాంటి తను నీచమైన చావు చావలేడు. తన శరీరాన్ని పవిత్రమైన గంగాజలాల్లోనే వదలదలచాడు. గంగలో ప్రాణాలు అర్పించినవారికోసం కైలాసం తలుపులు బార్లాగా తెరిచి వుంటాయట! తను అంతకంటే కోరదగిన చావు లేదు!

దేశంలోని పవిత్ర నదీనదాల్లో స్నానాలు చేసి, చివరకు తను గంగానదిలో ప్రాణాలు వదిలేస్తాడు.

ఏమైనా భార్యాబిడ్డలను గురించి ఇక ఆలోచించటం అనవసరం! వాళ్ళతో తనకు ఋణం తీరిపోయింది. ఈ లోకంతోనే తనకు ఋణం తీరిపోయింది. ఆ డబ్బు తన చేతుల్లో వుండగానే చూడాల్సిన పుణ్యక్షేత్రాలూ, అవీ దర్శించి కాశీ చేరి గంగానదిలో తన భౌతిక శరీరాన్ని పరిత్యజిస్తాడు!

శేషయ్య కృష్ణా గోదావరీ నదుల్లో స్నానాలు చేసి ఇంత పుణ్యం మూట కట్టుకొని తన ప్రయాణాన్ని సాగించాడు. పూరీ జగన్నాథుని సందర్శించి త్రివేణీ సంగమానికి పయనమైనాడు. త్రివేణిలో మునిగి కాశీకి ప్రయాణం కట్టాడు. మార్గమధ్యంలోవున్న పుణ్యతీర్థాలు సేవించీ, పుణ్యక్షేత్రాలు సందర్శించీ, ఎట్టకేలకు శేషయ్య కాశీ చేరాడు.

కాశీ చేరేసరికి శేషయ్య చేతిలో పది రూపాయలు మాత్రమే మిగిలి ఉన్నాయి. వెళ్ళినరోజే గంగలో స్నానం చేసి, కాశీదేవిని దర్శించి రాత్రి అయేసరికి కాశీ ఘాటుకు దగ్గరలో వున్న ఓ సత్రానికి చేరుకొన్నాడు. ఆ రోజు భోజనానికీ అదీ పోగా ఇంకా ఆరురూపాయల చిల్లర మిగిలి వుంది.

ఆ రాత్రి పడుకొని శేషయ్య ఆలోచించాడు-తను రేపు ఈ జీవితాన్ని చాలించబోతున్నాడు. తనకు భూమి మీద నూకలు నిండాయి. తనకు భగవంతుని ఆజ్ఞ అయింది. తెల్లవారుఝామున నదిలో స్నానం చేస్తూ, అలా-అలా-లోపలకు పోయి గంగమ్మతల్లి ఒడిలో శాశ్వతంగా కన్ను మూస్తాడు! తనకు ఆఖరు రాత్రి ఇదే! తను పడుకొన్న చోటున రేపు ఈ శేషయ్య ఉండడు. ఈ చోటు-తను పడుకున్న చోటు- రేపు ఖాళీగా ఉంటుంది. శేషయ్య లేచి కూర్చొని తను పడుకున్న చోటును మమకారంతో తాకి చూసుకొన్నాడు. శేషయ్య అంతరంగం లోని అజ్ఞాతశక్తు లేవో జీవితంమీద ఆశల్ని, మమకా

రాళ్ని రెచ్చకొడుతున్నాయి. భార్యా బిడ్డల్ని తల్చుకొని కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు.

ఛీ! తను తిరిగి ఇంటికి పోవటమా? ఏ ముఖం పెట్టుకుని ఇంటికి పోతాడు? తను ఇంత దిగజారి పోతున్నాడేం? తనకోసం ఓ వైపున స్వర్గ ద్వారాలు తెరిచివుంటే, మళ్ళీ నరకకూపంలోకి పోతాడా? గుక్కెడు ప్రాణం-కళ్ళు మూసుకుని బుడుంగుమంటే పోతుంది. ఆ తరువాత తనకు శాశ్వతశాంతి లభిస్తుంది. శివుడి ఆజ్ఞ అయింది. ఇక ఈ జీవితానికి మంగళం పాడతాడు. ఎవరి కెవరు? ఏది శాశ్వతం?

గంగానది హోరు వినబడుతోంది. శేషయ్య బుర్రలో-ఆలోచనలు, నదిలోని అలల్లా అనంతంగా లేచి పడుతున్నాయి. ఇలా ఆలోచిస్తూ శేషయ్య మగతగా మత్తుగా నిద్రలోకి జారుకున్నాడు.

ఏ తెల్లవారు ఝాముకు నిద్రపట్టిందో పాపం శేషయ్యకు! నిద్ర లేచేసరికి తెల్లంగా తెల్లవారిపోయింది. సూర్యకిరణాలు శేషయ్య వంటిని చురచురా తాకాయి. శేషయ్య వులిక్కిపడి లేచాడు. ఎంతపని జరిగింది! తను చావదలుచుకున్న మనిషే? మరణించదలచి అంత మైమరచి నిద్రపోతాడా? తన మీద తనకే రోత పుట్టింది. శేషయ్యకు అంత రోతలోనూ, శేషయ్య హృదయాంతరాళాల్లో ఎక్కడో ఆనందం మువ్వల చప్పుడు చేస్తూ గంతులేసింది. శేషయ్యలోని నైరాశ్యం దాని గొంతు నులిమి పైకి వచ్చింది. ఛీ! ఏం బ్రతుకు? తను చావదా

నికి సందేహిస్తున్నాడా ? ముమ్మాటికీ లేదు. ఇటు సూర్యుడు అటు పొడిచినా తను ఆగడు? చచ్చి తీరుతాడు! శేషయ్య లేచి సంచి సర్దుకొని, వే వేగంగా, గంగానదికేసి బయలుదేరాడు—

ఉదయభానుడి కిరణాలు గంగమ్మ తల్లిని పొదివి పట్టుకున్నాయి. వెండి తళుకులు కప్పుకొని గంగానది మెరుస్తోంది.

నది వొడ్డుకు వచ్చి శేషయ్య జేబులో చెయ్యి పెట్టి చూసుకున్నాడు. ఇంకా ఆరు రూపాయల చిల్లర వుంది. యీ డబ్బుతో ఈరోజు కూడా మహారాజులా జీవితం గడపొచ్చు! మళ్ళీ తను జీవితాన్ని చూడబోతున్నాడా! హాయిగా ఈరోజు తినీ, రేపు చావచ్చు! మిగిలిన డబ్బులు వుంటే గుడ్డివాళ్ళకు దానం చేస్తే ఆ ఫలితం దక్కుతుంది. ఆఖరిరోజు తను మనసారా తినీ, ఆనందించీ, మరీ చస్తాడు! అది గాకపోయినా ఇప్పుడు నదిలో పడటం ఎవరైనా చూసి బయటకు లాగొచ్చు! అప్పుడు తన పనేంకాను? అన్నట్టు గుర్తొచ్చింది. తన మతి మండ; అసలుసంగతే ఇంతవరకూ గుర్తులేదు. రేపు వైకుంఠ ఏకాదశి! పర్వదినం! ఏకాదశినాడు మరణిస్తే స్వర్గద్వారాలు తెరిచి వుంటాయనీ, పుష్పవిమానం వచ్చి తీసుకెళుతుందనీ శాస్త్రాలు చెపుతున్నాయి. ఇన్నాళ్లు వుండీ చూస్తూ చూస్తూ తను ఈరోజు చావటం ఏమిటి? రేపు ఏకాదశి! తెల్లవారుఝామున ఈ తుచ్ఛ దేహాన్ని విసర్జించి తను పరమాత్మలో లీనం అయిపోతాడు. తెల్ల

వారుఝాము నైతే తను మునగటం ఎవరూ చూసి బయటకు లాగరుకూడా!

శేషయ్యా దంతధావనం చేసి, నదిలో స్నానం చేసి సత్రానికి తిరిగొచ్చాడు. నదినుండి తిరిగొచ్చిన దగ్గరనుంచీ అతని మనస్సు పీకుతూనే వుంది!

తను భయపడుతున్నాడా, ప్రాణంమీద తనకు మమకారం తీరలేదా? ఏమిటి తను ఇలా మెత్తబడి పోతున్నాడు? శేషయ్యా అంతరాత్మ ఘోషించింది. కాని శేషయ్యా మళ్ళీ తన అంతరాత్మను తనే సమాధాన పరచు కున్నాడు. వైకుంఠం తలుపులు రేపు బార్లాగా తెరిచి వుంటాయి. లోపలకు తను సునాయాసంగా ప్రవేశించ గలడు.

ఆ రోజు కాశీలో వున్న వింత అన్నిటినీ చూసి, ఊరంతా తిరిగి, రాత్రికి సత్రం చేరుకున్నాడు శేషయ్యా.

ఆ రాత్రి మళ్ళీ శేషయ్యా మథనపడసాగాడు- ఇంకా కొన్ని గంటల్లో తను ప్రాణాలు త్యజించబోతు న్నాడు! జీవితం ఎంత విచిత్రమైంది? ఇవ్వాళ్టి తెల్ల వారు జామున నదిలో పడివుంటే ఇప్పుడు తను ఇక్కడ వుండేవాడా? తను పడుకొన్న చోటు ఖాళీగా ఉండేది. ఆ ఊహ రాగానే శేషయ్యా శరీరం జలదరించింది. కాని తన శరీరం-గచ్చుమీద బరువుగా వాలి వుంది. తను ఈ రోజు పగలంతా ఎన్ని వింతలు చూశాడు? ముష్టివాళ్ళూ, రిక్షా లాక్కొని బతికేవాళ్ళూ-అంతా బతుకుమీద ఆశతో ఎంత కోలాహలంగా తిరుగుతున్నారు?

ఏమిటీ, తను తన నిర్ణయానికి దూరమౌతున్నాడా? తను బతికి ఇంకేం చేస్తాడు ? తిరిగి ఇంటికి వెళ్ళగలడా? వెళ్ళి వూళ్లోవాళ్ల ముఖం చూడగలడా ? ఇంతపనీ జరిగాక తన పెళ్లాం ముందుకు పోగలడా ? అది ఇద్దెన్ల వ్యాపారం చేస్తుంటే చూసి తను సహించగలడా? తన ఆత్మాభిమానం ఏమయింది ? తన పౌరుషం మంట గలిసిందా ? ఏమైనా తను ఈ నిర్ణయాన్నుంచి వెనుదిరగ లేదు ! తన హృదయంలో రగులుకుపోతున్న ఈ చిచ్చు, గంగా గర్భంలో ఆరవలసిందే! తను మరణిస్తాడు-వైకుంఠ ఏకాదశి తెల్లవారుజామున ఆ గంగమ్మ పొత్తిళ్లలో శాశ్వతంగా కళ్లు మూస్తాడు !

తన ఆత్మకు శాంతీ - ముక్తి - మోక్షం లభిస్తాయి.

గంగానది రొద మృత్యుదేవత లాలిపాటలా శేషయ్య చెవులకు వినపడుతోంది. అతడి హృదయంలో-ఆశా-నిరాశా-జీవితమూ-మృత్యువూ - పెనుగులాటతో నిండిపోగా-భయంకరమైన ఆలోచనలతో దుస్స్వప్నాలతో ఆ రాత్రి మూడు జాములు గడిపాడు శేషయ్య.

నాలుగో జామున శేషయ్య లేచి, గుడ్డల సంచి సర్దుకొని, నిశ్శబ్దంగా సత్రంలోనుంచి బయటకు నడిచాడు. వీథులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. గంగానది హోరు దూరంగా వినబడుతోంది. పిండి ఆరబోసినట్లు వెన్నెల. శేషయ్య చకచకా నదికేసి నడక సాగించాడు. గంగానది తెల్లత్రాచులా మెరుస్తూ గంభీరంగా కదిలిపోతోంది.

శేషయ్య నది దరిదాపులకు వచ్చేసరికి వెనకనుండి ఏదో శబ్దం వినిపించింది. శేషయ్య వేగంగా నడుస్తూ నదిని సమీపించాడు. వెనకనుంచి వస్తోన్న శబ్దం శేషయ్య వేగాన్ని మించి దగ్గరౌతూంది. శేషయ్య నది కట్ట ఎక్కి చేతిలో సంచిని నదిలోకి విసిరేశాడు. పంచెను మొలకు దోపుకొని నదిలోకి దూకబోతున్న శేషయ్య భుజాలమీద బలమైన చేతులు పడ్డాయి. నదిలోగి ఒరిగి పోతూన్న శేషయ్య శరీరాన్ని, బలవంతంగా వెనక్కు ఒక్క గుంజు గుంజాయి ఆ చేతులు.

శేషయ్య వెనక్కు తిరిగి చూసి నివ్వెరపోయాడు.

పోలీసులు! శేషయ్యను చెరో రెక్కా పట్టుకొని నుంచున్నారు.

నదిలో పోవాల్సిన శేషయ్య ప్రాణాలు పోలీసుల చేతుల్లో పోయినట్లయినై.

“నగలన్నీ నదిలోనే పారేశావా?” అన్నాడు ఒకడు.

శేషయ్య నిలువుగుడ్లు వేశాడు.

“పంచెలో ఏమన్నా దాచాడేమో?” అంటూ ఒక పోలీసు శేషయ్య చేతులు పైకెత్తి పట్టుకోగా, రెండవ వాడు శేషయ్య గుడ్డలు తనిఖీ చేశాడు.

“ఊఁ! పద స్టేషన్‌కు. అక్కడగాని అసలు వ్యవహారం బయటపడదు!” మెడమీద చెయ్యివేసి పోలీసు స్టేషన్‌కు నడిపించారు శేషయ్యను.

* * * *

ఆ కిందరాత్రి సత్రంలో పడుకొన్న ఒక బాలిక చేతి గాజులూ, మెళ్ళో గొలుసూ మాయ మవటంవల్లా, శేషయ్యా ప్రవర్తన అనుమానకరంగా వుండటంవల్లా, అతణ్ణి వెంబడించి పట్టుకోబోగా, చేతులో వున్న నగల మూటను నదిలో విసిరినట్టూ, అది పోలీసులు కళ్ళారా చూసినట్టూ, కేసు బనాయించ బడింది. తన పేరు తప్ప ఊరూ, జిల్లా చెప్ప నిరాకరించిన శేషయ్యకు, మూడు సంవత్సరాల కఠినశిక్ష విధించబడింది.

• • • •

జైలు సెల్లులో కూర్చొని శేషయ్యా తన విధిని నిందించుకున్నాడు. ఏకాదశి ముందురాత్రి నదిలో దూకి వుంటే తనకు ఈ అవస్థ పట్టి వుండదు గదా? తెగింపు చేయలేని తనకు తగిన శాస్తి జరిగింది!

ఒక్క క్షణం జాగయితే తను నదిలో దూకి వుండే వాడు. ఆ ఒక్క క్షణం జాగువల్లనే తను యీ నరకం లోకి వచ్చిపడ్డాడు. భగవంతుడు తన్నింకా పరీక్షిస్తు న్నాడు! ఈ జీవుడుకి విముక్తి కలిగించలేడు కాబోలు? తను ఎంత నికృష్టమైన జీవితాన్ని అనుభవించాల్సి వస్తుంది? హంతకులూ, దొంగలూ, మధ్య తన నివాసం నేడు! అమరయ్యా మనుమడయిన తనకు ఎంత దుర్గతి పట్టింది?

ఇంకా నయం తన వూళ్లో తనవాళ్ళకు ఈ విషయం తెలియదు! తెలిస్తే తన తరతరాల వాళ్ళకూ

అపనింద వచ్చేదిగదా ? తను ధైర్యంగా, పోలీసు లాఠీ పోట్లకు కూడా లొంగకుండా, తనెక్కడి వాడో, ఏ వూరి వాడో, చెప్పకుండా వుండగలిగాడు !

ఆ ఆలోచనతో శేషయ్య ఆత్మకు తృప్తి కలిగింది. మళ్ళీ మథనపడసాగాడు—

తను యీరోజు చెయ్యని నేరానికి శిక్ష అనుభవిస్తున్నాడు ! తను దొంగతనం చెయ్యటమా ? శివ ! శివ! శిష్టజన రక్షకుడవే! ఆపద్బాంధవా! ఎక్కడున్నావయ్యా- ఇంత ఘోరం జరుగుతుంటే ?

'అవును ! నీవు దొంగవే !' శేషయ్య అంతర్వాణి ఘోషించింది. అవును తను దొంగే ? పెళ్ళాం దాచుకున్న రెండువందల రూపాయలు కాజేసి, తను పరారి అయ్యాడు. హే ! భగవాన్ ! క్షమించు ! అందుకు నన్ను ఈ విధంగా శిక్షించావా ? తన సొమ్ము తను తీసుకోవటం దొంగతనం చెయ్యటమా ? ఆ ముండ ఇడ్లెన్న వ్యాపారం మొదలు పెట్టకపోతే తను ఈ పాడుపని చేసి వుండేవాడా ?

"ఏంది సేసయ్యా ! మా పదాంతిలా కూకున్నావు ! లే ! లే ! రాళ్ళు పగలకొట్టాలంట ! వార్డర్ పిలుత్తోండాడు !"

"సేసయ్యంటే సేసయ్యే ? మా లావు పదాంతిలే ! బలే దొంగేశాలు పత్తాడు. మనందర్నీ మించిపోయాడనుకో !"

బీడీ దమ్ములు లాగుతూ నలుగురయిదుగురు ఖైదీలు శేషయ్య చుట్టూ చేరారు.

"ఇంకా కూర్చున్నా రేమరాత్రి లేవండి" అంటూ వార్డర్ కఱ్ఱ తిప్పుకుంటూ వచ్చాడు.

తాగే బీడీలు అవతల పారేసి, నెత్తి టోపీలు సర్దు కొంటూ బయలుదేరారు ఖైదీలు. శేషయ్యా మౌనంగా వాళ్ళతో కలిసి నడిచాడు.

రాళ్లు పగలకొడుతూ శేషయ్యా అరచేతులు చూసు కొని ఖిన్నుడయినాడు. ఏనాడూ పూచికపుల్ల ఎత్తు పని చెయ్యని తనకు ఈగతి పట్టిందిగదా?

పని సరిగా చెయ్యనివాళ్లను వార్డరు బూతులు తిడుతుంటే శేషయ్యకు అభిమానం ముంచుకొచ్చేది. తనను ఎక్కడ అంటాడోననే భయంకొద్దీ వళ్లువంచి పని చేసేవాడు. రాళ్లు పగలగొట్టటం, నీళ్లు తోడటం, కొయ్యలు చెక్కటం శేషయ్యా దినచర్య అయింది. రాత్రిళ్లు తనతోటి ఖైదీలు తమతమ అనుభవాలను కథలల్లి చెప్పటం వింటూండేవాడు శేషయ్యా. రానురానూ శేషయ్యంటే మిగతా ఖైదీలకు గురి ఏర్పడింది. అధికారులకూ మంచి అభిప్రాయం వుండేది. ఖైదీల కష్టసుఖాలు వాళ్ళ ప్రతి నిధిగా శేషయ్యా, అధికారులకు విన్నవించేవాడు.

తోటి ఖైదీలు తమ గతాన్ని తవ్వి చెబుతుంటే శేషయ్యా ఎంతో ఆసక్తితో వినేవాడు. చిన్నతనంనుంచీ సోమరితనానికి అలవాటుపడి, ఏపనీ చెయ్యకుండా దొంగ తనానికి దిగి, జీవితంలో సగభాగం జైల్లో గడిపిన వాళ్ళను చూసి శేషయ్యా మథనపడేవాడు. కొందరి జీవి

తాలు ఇలా ఎందుకు తయారవుతయ్యా అని ఆలోచించే వాడు.

తనకు అంతకుముందు తెలియని విషయాలెన్నో తెలుస్తున్నట్లుగా వుంది శేషయ్యకు. మానవజీవితం యెంత విలువైనదో, ప్రతి చిన్న దానికోసం మానవుడు ఎంత తహతహలాడిపోతున్నాడో, పరిశ్రమిస్తాడో జైలు జీవితంలో అర్థం అయింది శేషయ్యకు. ఒక్క బీడీముక్కను యెంత శ్రమపడి సంపాదిస్తారు యీ ఖైదీలు? తను ఆత్మహత్య చేసుకోనందుకు శేషయ్య యిప్పుడు బాధ పడటం లేదు. ఎన్నెన్నో వింతగాథలు, పతితుల చరిత్రలూ, తను విన్నాడు. పగలంతా పని చేసి రాత్రిళ్ళు వళ్లు మరచి నిద్రపోవటంలో ఎంత సుఖం ఉంది?

వీళ్ళందరకూ లేని కారణాలు తనకుమాత్రం ఏమున్నాయి ఆత్మహత్య చేసుకోవటానికి? తనెంత పొరపాటు చేసిందీ ఇప్పుడు తనకు అర్థం అవుతోంది. భార్య ఇద్దెన్లు అమ్మి సంసారాన్ని పోషించటానికి సిద్ధమైతే తనెంత అవివేకంగా ప్రవర్తించాడు! ఆనాటి అభిమానం పౌరుషం ఇప్పు డేమయినాయి? తన వంశ గౌరవం, కీర్తి ప్రతిష్ఠలూ, ఈనాడు తనకు అక్కరకు వచ్చాయా? వళ్లు వంచి పనిచేస్తే వార్డరు పూరుకుంటాడు. లేకపోతే కర్ర పైకి ఎత్తుతాడు! తల్లీకూతుళ్లు ఏమయిపోయారో? తను వారిపట్ల యెంత నిర్దయగా, దారుణంగా ప్రవర్తించాడు? అందుకు తను తగిన శిక్షే అనుభవిస్తున్నాడు!

శేషయ్య రాత్రిళ్లు తన సెల్లులో పడుకొని యిలా ఆలోచిస్తూ కుమిలి కుమిలి ఏడ్చేవాడు.

కాలం గడిచేకొద్దీ ఖైదీల అభిమానాన్ని పొందగలిగాడు శేషయ్య. తోటివాళ్లపట్ల శేషయ్య యెంతో వాత్సల్యం, ఆదరణ చూపించగలుగుతున్నాడు. సత్ప్రవర్తనకు శేషయ్య అధికారుల మన్ననలను కూడా పొందగలిగాడు! వయస్సు ముదిరి కాయకష్టం చేయలేని స్థితిలో వున్న శేషయ్యకు బండచాకిరీ తప్పించి, ఖైదీలకు వంట చేయటానికి నియమించుకొన్నారు. శేషయ్యకు ముందు ముందు కొంచెం కష్టంగా వున్నా, వంట చెయ్యటంలో ఎంతో నేర్పు ప్రదర్శించాడు. శేషయ్య వంట పరిశుభ్రంగా, రుచికరంగా చేసేవాడు. ఖైదీలు ప్రశంసాపరంపరలు శేషయ్యమీద కురిపించసాగారు. తనూ వాళ్లతో కులాసాగా కబుర్లు చెప్తూ కాలక్షేపం చెయ్యసాగాడు.

కాలం గడుస్తున్నకొద్దీ ఈ జైలునుండి యెప్పుడు బయటపడదామా అన్న ఆరాటం హెచ్చింది. తన పెళ్లాం బిడ్డలు ఏమయిపోయారో? ఇంకా ప్రాణాలతో వున్నారో తిండి దొరక్క యెంత బాధపడుతున్నారో! రోజు రోజుకు శేషయ్య హృదయం ఆవేదనతో దహించుకుపోతున్నది. ఏ క్షణాన తను ఈ జైలు గోడలు దాటి బయటకు వెళ్లగలడో? ఆ క్షణంకోసం శేషయ్య ఎదురు తెన్నులు కాస్తున్నాడు.

• • • •

ఆరోజు రానే వచ్చింది. శేషయ్య విడుదలయాడు. శేషయ్య మిత్రులు జైలు గోడలదాకా వచ్చి వీడ్కోలు ఇచ్చారు. నేరుగా స్టేషన్‌కు వచ్చి రైల్లో ఇంటికి ప్రయాణమైనాడు. శేషయ్య ఎక్కిన రైలు కాలాన్ని, దూరాన్ని చీల్చుకొని వేగంగా, శరవేగంగా ప్రయాణం చేసింది.

తెలతెలవారుతుండగా శేషయ్య దిగాల్సిన స్టేషన్‌కు వచ్చి బండి ఆగింది. శేషయ్య రైలు దిగాడు. అక్కడినుంచి తన ఊరు ఐదు మైళ్లలో వుంది. నడిచివెళ్తే అన్నం వేళకు వెళ్లగలడు. బస్సెక్కితే ఏ అరగంటలో దించుతుంది.

రైలుదిగి శేషయ్య అంతా పరికించి చూశాడు. స్టేషన్ అంతా మారిపోయి వుంది. స్టేషన్ వెడల్పూ, పొడవూ కూడ పెంచారు. స్టేషన్ పక్కనే రెండు కొట్లు కూడా వెలిశాయి. స్టేషన్‌కు వందగజాల దూరంలో రోడ్డుప్రక్కగా ఓ హోటలుకూడా వెలిసింది. ఎంతలో ఎంత మార్పు? రోడ్డుపక్కన వున్న చెట్లూ చేమలు కూడా మారిపోయినట్లుగా ఉంది శేషయ్యకు. తను ఊరు వదలి వెళ్లిపోయేప్పుడు ఇక్కడ ఒక్క బీడీకొట్టు కూడా లేదు. స్టేషనూ ఎంతో చిన్నదిగా వుండేది. మూడు సంవత్సరాలు కాదు తను ముప్ఫయ్ సంవత్సరాలు అజ్ఞాతవాసాన్ని అనుభవించి వచ్చినట్లుంది శేషయ్యకు.

స్టేషన్ దాటి బయటకు వచ్చి ఒక్క నిముషం తటపటాయించాడు శే.య్య నడిచి వెళదామా, బస్సు

మీద వెళదామా అని. జేబులోని చిల్లర తీసి చూసు కున్నాడు. అరణాల కానీ వుంది. బస్సులో వెళ్ళితే ఐదణాలు కావాలి. బస్సులో వెళితే డబ్బులు కాఫీకి సరిపోవు. వళ్లు నీరసంగా వుంది. రాత్రంతా నిద్ర లేక పోవటంతో తల బద్దలు కొట్టుకుపోతోంది. కాఫీ తాగితే కొంత సర్దుకుంటుంది. పైగా ఆకలిగా కూడా వుంది. ఏదైనా తిని కాఫీ తాగి వెళ్తే మంచిది. వెధవ బస్సు ఎందుకు, డబ్బులు దండగ? కాఫీ తాగి బయలుదేరితే ఎంతసేపు నడుస్తాడు? ఎంతదూరం గనక? చల్లబాటి వేళ మెల్లగా నడిచి వెళితే ఎంతపని?

అనుకుంటూ శేషయ్య హోటల్లోకి వెళ్లి కూర్చు న్నాడు. అది చాలా చిన్న హోటలు. నాలుగు బల్లలు వేసి వున్నాయి. తడికకు సినిమా పోస్టర్లు అంటించి వున్నాయి. ఒక పక్కగా చిన్న టేబులూ కుర్చీ వేసి వున్నాయి. కుర్చీలో కూర్చొని చిల్లర లెక్క చూసుకుం టున్న పాతికేళ్ళ యువకుడు లేచి వచ్చి "మీకేం యివ్వ మంటారూ? వేడివేడి ఇడ్లీవుంది ఇవ్వమంటారా?" అన్నాడు.

"ఊఁ!" అని తల వూపాడు శేషయ్య.

అప్పటికి ఇద్దరు కూర్చొని కాఫీ తాగుతున్నారు. శేషయ్య ఇడ్లీ తినేసరికి, వాళ్లు కాఫీ ముగించుకొని బయ టకు వెళ్లారు. అంతలో బస్సు వచ్చి హోటలుకు అంత దూరంలో ఆగింది.

"వేడివేడి పెసరట్టు వుంది యివ్వమంటారా?"

"అల్లప్పచ్చడి వుందా?" అన్నాడు శేషయ్య. నోరు సవి చచ్చి వుంది. అల్లప్పచ్చడి రుచిని తలచుకుంటూ ఆప్యాయంగా అడిగాడు.

"ఓ పస్టుకలాసుగా వుంది! పెసరా ఒకటీ" లోపలకు కేక వేశాడు.

లోపల పెనంమీద 'సుఁయ్‌' మన్న ధ్వని శేషయ్య చెవులకు వినిపించింది.

పెసరట్టుకూడా తిని 'కాఫీ' అన్నాడు శేషయ్య. ఇడ్లీ పెసరట్టు తిన్నమీదట శేషయ్య కడుపులో మత్తుగా అనిపించింది.

సర్వరూ కమ్ మానేజరు శేషయ్యకు కాఫీ ఇచ్చి లోపలకు వెళ్ళాడు.

శేషయ్య కాఫీ తాగుతుండగా బస్సు కదలబోతూ వుంది. కండక్టరు కేకలు వేస్తున్నాడు బస్సు పోబోతుందని.

అబ్బ! ఈ కాఫీ తాగినమీదట బస్సులో పోతే ఎంత హాయిగా వుంటుంది? ఆ ఆలోచన బుర్రలో కదలగానే శేషయ్య కళ్ళు హోటలంతా కలియజూశాయి. ఆ హోటల్లో తను మినహా యింకెవరూ లేరు! లోపలకు పోయిన హోటలు యజమాని బయటకు రాలేదు. వస్తూన్న అలికిడి కూడా లేదు. క్షణంలో బస్సు బయలుదేర బోతుంది. తను బస్సు యెక్కి కూర్చుంటే ఎవరు చూడొచ్చారు? అతను బయటకు వచ్చేసరికి బస్సు దాటి

వెళ్ళిపోతుంది. తను డబ్బు యివ్వటం మర్చిపోయాడు! ఆఁ అంతే! ఆమాత్రం తను చెప్పలేడా? గజదొంగల్ని తను ఎరుగు! అంతా సహవాస దోషం-అంతే—

శేషయ్య లోపలకు తొంగిచూసి, ఒక్క దూకులో హోటలునుండి బయట కొచ్చేసి, బస్సు కేసి పరుగెత్తాడు. సాగిన బస్సు శేషయ్యను చూసి ఆగింది. శేషయ్య బస్సెక్కి కూర్చున్నాడు. బస్సు దడదడమని గరగర సాగి మళ్ళీ ఆగిపోయింది. శేషయ్య గుండెల్లో బస్సు ఇంజెనుకు మించిన రొద సాగింది. బస్సు స్టార్టు అయినట్లే అయి మళ్ళీ ఆగింది.

ఒక్క నిమిషం! శేషయ్య ప్రాణాలు బిగబట్టుకు కూర్చున్నాడు.

వెనకనుంచి హోటలు యజమాని కేకలు వేసు కుంటూ పరుగెత్తుకొని వచ్చి, శేషయ్య చొక్కా పట్టు కొని బస్సులోనుంచి ఒక్క గుంజు గుంజాడు.

"ఎక్కడికి పోదామనుకున్నావురా దొంగనా....! తెగతిని ఎగేసిపోదా మనుకున్నావా?" శేషయ్య చొక్కా పట్టుకొని హోటల్లోకి తీసుకెళ్ళాడు.

"అమ్మ ముసలాడా! పొడవండస! తలోక పోటూ!" అంటూ ఐదారుగురు హోటల్లోకి వచ్చి శేషయ్య చుట్టూ కమ్ముకొన్నారు. శేషయ్య చుట్టూ జనం! తలోకమాట!

పాపం! శేషయ్య! ఏం చెబుతాడు!

"దొంగ సచ్చినోడా! ఎవడిసొమ్మురా? తేరగా తిని పారిపోతున్నావ్? ఉండూ! నీ తలపండు పగల!" గలగలమంటూ లోపల అట్లపెణం దగ్గరనుంచి ఆడది, కాలే కాలే అట్లకాడతో జనాన్ని తోసుకొని శేషయ్యా ముందు కొచ్చింది.

శేషయ్యా గుడ్లు తేలేశాడు! నోరు బిగుసుకు పోయింది.

"ఎద్దులాగున్నావు! పని చేసుకోకూడదూ? ఈ దొంగబుద్ధి ఏమిటి నీకు? నీ సిరుసు పగలా!" అంటూ ఆమె చేతిలోని అట్లకాడను శేషయ్యా ముఖంమీదకు యెత్తింది.

"అమ్మా! ఆగవే! ఆ మనిషి ఎవరో చూడు!" అన్నది కూతురు తల్లికి అడ్డంవచ్చి.

"అవునే అమ్మాయ్!" ముఖమంతా కళ్లు చేసు కొని చూసింది ఆమె.

"మా నాయ....న....లాగున్నాడే! సన్నగా దీర్ఘం తీసింది కూతురు.

ముఖంలోకి పరీక్షగా చూసి "అలాగ ఉండట మేమిటే! మీ నాయనే!" అన్నది తల్లి.

"అయ్యో! మీరా?" ఆశ్చర్య సంభ్రమాలతో ఉక్కిరి బిక్కి రవుతూ శేషయ్యముందు నిల్చుంది రామ సుబ్బమ్మ.

రామసుబ్బమ్మ చేతులు పట్టుకొని "నేనే! నన్ను.... నన్ను...." వణుకుతున్న శేషయ్య కంఠంలోనుంచి 'క్షమించు' అన్న శబ్దం బయటకు రాలేకపోయింది.

"అట్లా గుడ్లప్పగించి చూస్తారేం ? మా నాయనే-మీ మామగారు" హోటలు సర్వరు కమ్ మేనేజరు అయిన యువకుడ్ని వుద్దేశించి అన్నది శేషయ్య కూతురు కమల.

"తస్సాదియ్యా! పారిపోయిన మనిషా!" అన్నాడు అల్లుడు.

"కాదు మారిపోయిన మనిషి" అన్నది రామసుబ్బమ్మ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ.